క్లుప్తంగా

8న కొడంగల్ మండల సమావేశం

కొడంగల్: ఈనెల 8న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పాండు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు లు, అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరవ్వాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న సర్పంచ్

పూడూరు: మండల పరిధిలోని తిర్మలాపూర్ పంచాయతీ పరిధిలోని పేద కుటుంబానికి సర్పంచ్ ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కమ్లీబాయి పెంటయ్య మాట్లాడుతూ గ్రామంలో ఎటువంటి కార్యం నిర్వహించినా సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు పెంటయ్య, నాయకులు రాములునాయక్, తదితరులు పాల్గొన్నారు.

బాస్‌పల్లిలో..

దోమ: పేదలకు అండగా డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి నిలుస్తున్నారని బాస్‌పల్లి సర్పంచ్ పద్మ, సీనియర్ బీఆర్‌ఎస్ నేత కావటి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బాస్‌పల్లి గ్రామంలో రాకొండ చంద్రయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న చైర్మన్ సర్పంచ్‌తో బాధిత కుటుంబానికి రూ.5వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహులు, చంద్రయ్య, ప్రశాంత్, రామయ్య, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

కొడంగల్: పట్టణ శివారులోని బండల ఎల్లమ్మ ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను శుక్రవారం ప్రారంభించారు. జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బంది కలుగొద్దనే లైట్లు ఏర్పాట్లు చేసినట్లు కౌన్సిలర్ మధుయాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రమేశ్‌బాబు, బాకారం అరుణ్, నర్సిరెడ్డి, కిషన్, శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, అచ్యుతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా కాంగ్రెస్

డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి

కుల్కచర్ల: కాంగ్రెస్ పార్టీ పేదలకు అండగా నిలుస్తుందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అంతారం గ్రామానికి చెందిన దేవమ్మ అనారోగ్యంతో మృతిచెందారు. కాగా విషయం తెలుసుకున్న డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్ రెడ్డి స్థానిక నేతల ఆధ్వర్యంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అంత్యక్రియలకు అంతారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందజేశారు. ఈకార్యక్రమంలో శివరాములు, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం

సర్పంచ్ రాజిరెడ్డి

దోమ: ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరమని సర్పంచ్ రాజిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో కరాటే శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సర్పంచ్ ప్రతీ ఒక్కరు కరాటే నేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పురందాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించండి

సర్పంచ్ శిరీష


గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ శిరీష

దౌల్తాబాద్: గ్రామాభివృద్ధికి సహకరించాలని దౌల్తాబాద్ సర్పంచ్ శిరీష అన్నారు. శుక్రవారం పంచాయతీ అభివృద్ధికి వార్షిక బడ్జెట్ ప్రణాళికపై సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా చేయాల్సిన పనులపై చర్చించారు. గతేడాది చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను సభకు వివరించారు. పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేస్తామన్నారు. అనంతరం ఉపాధి పనులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆనంద్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అగ్నిపథ్‌కు ఎంపికైన విద్యార్థులకు సన్మానం


విద్యార్థులను సన్మానిస్తున్న హెచ్‌ఎం

దోమ: మండల పరిధిలోని ఐనాపూర్ గ్రామానికి చెందిన పేట రాములు, బోయిన కృష్ణ అనే విద్యార్థులు అగ్నిపథ్‌కు ఎంపికయ్యారు. ఈ మేరకు శుక్రవారం దోమ జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రామకృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలన్నారు.

నిర్లక్ష్యానికి నాలుగేళ్లు!

అధికారుల అలసత్వం.. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం.. ప్రజలకు శాపంగా మారింది. కాగ్నానదిపై ఉన్న పాత వంతెన దెబ్బతినడంతో కొత్త వంతెన నిర్మించేందుకు కాంట్రాక్టరు పనులు అప్పగించారు. సమయానికి బిల్లులు చెల్లించకపోవడంతో ఇద్దరు కాంట్రాక్టర్లు పనులు మధ్యలోనే వదిలేశారు. దీంతో వంతెన నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది.

- అసంపూర్తిగాస్టేషన్ ధారూరు–దోర్నాల్ వంతెన పనులు
- సకాలంలో అందని బిల్లులు
- పనులు నిలిపేసిన కాంట్రాక్టర్లు
- ప్రతీ వర్షాకాలం రాకపోకలు బంద్


నిలిచిపోయిన వంతెన పనులు

ధారూరు: భారీ వర్షాలకు దెబ్బతిన్న వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. నిధుల లేమి కారణంగా పనులు నిలిపివేశారు. కొత్త కాంట్రాక్టర్‌ను నియమించిన పనులు మధ్యలోనే వదిలేశాడు. చేసిన పనికి బిల్లు రాకనే పనులు చేయలేకపోతున్నామని కాంట్రాక్టర్ అధికారులకు వివరించినట్లు సమాచారం.

ఐదేళ్ల క్రితం నిధులు మంజూరు

2016లో కురిసిన భారీ వర్షాలకు లక్నాపూర్, సర్పన్‌పల్లి ప్రాజెక్టులు పూర్తిగా నిండిపోయాయి. అలుగుల నుంచి నీరు కాగ్నా నదిలో చేరి ఉధృతంగా ప్రవహించింది. దీంతో మండల పరిధిలోని స్టేషన్‌ధారూరు–దోర్నాల్ గ్రామాల మధ్య ప్రవహిస్తున్న నది ప్రవాహానికి పాత వంతెన కొట్టుకుపోయింది. రాకపోకలు స్తంభించడంతో ఐదేళ్ల క్రితం ఈ వంతెన నిర్మాణానికి రూ.4.65కోట్ల నిధులు మంజూరయ్యాయి. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో పనులు నిలిపివేశారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు, ప్రజల ఆందోళన మేరకు కాంట్రాక్టర్‌కు మొదటి బిల్లు మంంజూరైంది. దీంతో ఆ కాంట్రాక్టర్ అసంపూర్తి పిల్లర్ల మధ్య మట్టి వేయించడంతో బిల్లు మంజూరు చేయించాం.. పనులు ప్రారంభమయ్యాయని నాయకులు సంతోషంతో వెల్లడించారు. రెండో సారి బిల్లు పెట్టుకున్న కాంట్రాక్టర్‌కు డబ్బులు మంజూరు చేయకపోవడంతో పనులను అసంపూర్తిగా వదిలివెళ్లాడు. దీంతో ప్రతీ ఏడాది వర్షాకాలంలో కాగ్నానది ఉధృతంగా ప్రవహించి రాకపోకలు స్తంభించడం... పశువులు, మేకలు మృత్యువాత పడుతున్నాయి. రెండేళ్ల క్రితం ఓ వ్యక్తి మరణించగా.. మరో వ్యక్తి నీటిలో కొట్టుకుపోయి ప్రాణాలతో బయటపడ్డాడు. వచ్చే వర్షాకాలం నాటికి పనులు పూర్తి చేస్తారాలేదా అని ప్రజలు, ప్రజాప్రతినిధులు ఆందోళన చెందుతున్నారు. మరో కొత్త కాంట్రాక్టర్ పనులను ప్రారంభించాడు. నదికి రెండు చివర్లలో సీసీ బెడ్‌తో పిల్లర్లు నిర్మించాడు. కొత్త కాంట్రాక్టర్‌కు సైతం బిల్లులు మంజూరు కాకపోవడంతో పనులు నిలిచిపోయాయని ప్రజలు చర్చించుకుంటున్నారు. మూడో కాంట్రాక్టర్ అయినా బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేస్తారో లేదో వేచి చూడాల్సిందే.

చర్యలు తీసుకుంటాం



మొదటి కాంట్రాక్టర్‌కు పూర్తిగా బిల్లులు ఇప్పించాం. అకస్మాత్తుగా పనులు నిలిపివేశాడు. నోటీసులు ఇచ్చిన తర్వాత కొత్త కాంట్రాక్టర్‌కు పనులను అప్పగించాం. నిర్ణీత సమయానికి అనుకున్న పనులు చేపట్టకపోవడంతో కాంట్రాక్టర్‌ను మార్చేశారు. 3వ కాంట్రాక్టర్‌కు పనులు ఇచ్చాం. వచ్చే వర్షాకాలం నాటికి పనులు పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటాం.

– శ్రావణ్‌కుమార్, ఏఈ, ఆర్‌అండ్‌బీ

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వండి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకయ్య


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

పరిగి: ప్రభుత్వ భూమిలో నిరుపేదలకు, ఇళ్లు లేని వారికి స్థలాలను కేటాయించాలని శుక్రవారం ప్రజా సంఘాల నాయకులు తహసీల్దార్ రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకయ్య మాట్లాడుతూ.. ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్రూం ఇళ్ల సాధనకు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిత్యం పోరాడుతామన్నారు. రంగాపూర్ గ్రామంలో 9.39 ఎకరాల ప్రభుత్వ భూమిని అక్రమార్కులు కబ్జా చేశారని.. ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. అధికారులు కాలయాపన చేయడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కుల్కచర్ల మండలం వెంకటపూర్ గ్రామంలో డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణ పనులను పూర్తయినా నేటికి పేదలకు కేటాయించకపోవడం సరికాదన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు హబీబ్, సత్తయ్య, రఘురాం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్


ప్రింటర్‌ను అందజేస్తున్న కిరణ్‌కుమార్

దోమ: ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యాసించాలని కిసాన్ మోర్చా రాష్ట ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని మోత్కూర్ జిల్లా పరిషత్ పాఠశాలకు ప్రింటర్‌ను అందించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు పట్టుదలతో చదివితే ఫలితాలు అందుతాయన్నారు. పదోతరగతి విద్యార్థులు ఆందోళన చెందకుండా పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. అనంతరం స్పెషల్ తరగతులకు హాజరయ్యే పదో తరగతి విద్యార్థులకు స్నాక్స్ కోసం స్థానిక సర్పంచ్ కేశవులు హెచ్‌ఎంకు రూ.10వేల ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కరణం శ్రీకాంత్‌రావు, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మేకల యాదయ్య, దళిత మోర్చా మండల అధ్యక్షుడు నర్సింహులు, ఓబీసీ మండల అధ్యక్షుడు రాజు, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు భాస్కర్, బీజేవైఎం మండల ప్రధానకార్యదర్శి మహేశ్, బీజేపీ నేతలు బాలుయాదవ్, అనంతయ్య, ఉపాధ్యాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి

ఎస్‌ఐ విజయ్‌ప్రకాశ్


వ్యాపారస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ విజయ్‌ప్రకాశ్

మోమిన్‌పేట: వ్యాపారస్తులు విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్‌ఐ విజయ్‌ప్రకాశ్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని మేకవనంపల్లి వ్యాపారస్తులకు పోలీస్‌స్టేషన్‌లో సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ కెమెరాలతో దొంగతనాల నుంచి రక్షణ ఉంటుందన్నారు కేసుల విచారణకు సైతం ఉపకరిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మేకవనంపల్లి వ్యాపారస్తులు తదితరులు ఉన్నారు.

రాజీ మార్గమే రాజ మార్గం

మోమిన్‌పేట: రాజీ మార్గమే రాజ మార్గమని ఎస్‌ఐ విజయ్‌ప్రకాశ్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 11న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకుని సమయం ఆదా చేసుకోవాలని ఆయన సూచించారు. పోలీసు రాజీపడే కేసులను గుర్తించి ఇరు వర్గాల వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తారన్నారు.

కంటి వెలుగును దశల వారీగా పూర్తిచేస్తాం

మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర


వికారాబాద్ అర్బన్: కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించిన కమిషనర్


కుల్కచర్ల: చెరువుముందలి తండాలో సీహెచ్‌ఓ చంద్రప్రకాశ్


నవాబుపేట: కంటి అద్దాల పంపిణీ

వికారాబాద్ అర్బన్: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర సూచించారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని 10, 25, 33వ వార్డుల్లో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. కంటి వెలుగు కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించామన్నారు. దశల వారీగా మున్సిపల్ పరిధిలోని 34వార్డుల్లో కంటి వెలుగు కార్యక్రమం పూర్తి చేస్తామన్నారు.

చెరువుముందలి తండా(ఎ)లో..

కుల్కచర్ల: మండలం చెరువుముందలి తండా(ఎ)లో కొనసాగుతున్న కంటివెలుగు కార్యక్రమాన్ని కుల్కచర్ల కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చంద్రప్రకాశ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అంధ్వత్వ నివారణే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కంటివెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'కంటి వెలుగు' సద్వినియోగం చేసుకోండి

నవాబుపేట: ప్రభుత్వం అంధత్వ నివారణకు చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ పోలీస్ రాంరెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఆర్కతల గ్రామంలో శుక్రవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు కంటిపరీక్షలు తప్పక చేయించుకోవాలన్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు, కళ్ల అద్దాలు అందజేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాములు, ఎంపీటీసీ సభ్యుడు యాదయ్య, ఉప సర్పంచ్ సంగారెడ్డి, నాయకులు గోపాల్‌రెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాలధారులపై కేసులను కొట్టేయండి

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య


ప్రధాన చౌరస్తాలో ఆందోళన చేస్తున్న మాలధారణ స్వాములు, నేతలు

కుల్కచర్ల: శివస్వాములపై పెట్టిన కేసులను వెంటనే కొట్టివేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఘణపురం వెంకటయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రధాన చౌరస్తాలో శివస్వాముల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందుత్వ భావాలపై కొందరు ఇష్టానుసారం మాట్లాడి మనోభావాలను దెబ్బతీయడంతో పాటుగా వారు గుర్తింపు పొందాలని చూస్తున్నారని అన్నారు. యాలాల మండలంలో సైతం శివస్వాములను ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టారన్నారు. దాడులకు ప్రేరేపించిన వారిపై కాకుండా శివస్వాములపై కేసులు నమోదు చేయడం పరోక్షంగా హిందుత్వంపై దాడిచేయడమేనని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉమాపతి రెడ్డి, చంద్రయ్య, బాల్‌రెడ్డి, రాజేశ్వర్, మాలధారణ స్వాములు పాల్గొన్నారు.

ప్రతీ మొక్కను సంరక్షించాలి

అనంతగిరి: గ్రామాల్లో చేపట్టిన ఎవెన్యూ ప్లాంటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ సత్తయ్య అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని పీరంపల్లి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాటిన ప్రతీ మొక్క బతికేలా సరంక్షణ చర్యలు చేపట్టాలన్నారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ పర్యటనలో ఎంపీఓ నాగరాజు, ఉప సర్పంచ్ శివారెడ్డి, ఎఫ్‌ఏ అంజయ్య తదితరులు ఉన్నారు.

సబ్సిడీ రుణాలకు లాటరీ

బంట్వారం: ప్రభుత్వం అందజేస్తున్న మైనార్టీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు లాటరీ పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కోట్‌పల్లి ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడీ రుణాలు వినియోగించుకోవాలని సూచించారు. మండల పరిధిలో 141 దరఖాస్తులు రాగా రూ.లక్షలకు సంబంధించి కోట్‌పల్లి మండల కేంద్రానికి చెందిన ముగ్గురు లబ్ధిదారులు ఎంపికయ్యారు. రూ.2లక్షల రుణానికి ఎన్నారం గ్రామస్తుడు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. వీటికి మైనార్టీ కార్పొరేషన్ నుంచి 80శాతం సబ్సిడీ వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కోట్‌పల్లి సర్పంచ్ విజయలక్ష్మి, ఎంపీఓ డానియల్, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత


పూడూరు: రితిక్‌రెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

పూడూరు: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి తనయుడు రితిక్ రెడ్డిలు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు వారిని ఘనంగా సన్మానించారు. అనంతరం అన్నదానం కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నవ్య, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నర్సింహారెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, సురేందర్‌ముదిరాజ్, శ్యాంసుందర్‌రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివ పడిపూజ

దోమ: శివస్వాములు ద్వాదశ జ్యోతిర్లింగ మహాపడి పూజలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం మండల పరిధిలోని పాలేపల్లిలో గ్రామానికి చెందిన దస్తయ్య అనే మాలధారణ స్వామి శివ పడి పూజను నిర్వహించారు. ఈ పూజకు శివస్వాములు, నాయకులు హాజరయ్యారు. జెడ్పీటీసీ సభ్యుడు నాగిరెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు రాజిరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి కుమారుడు రితిక్ రెడ్డి పలువురు కాంగ్రెస్ నేతలతో కలసి పూజలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్ రెడ్డి, యూత్ నాయకులు నాగవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు కోసం సర్పంచ్ ఇంటికి

సమయపాలన పాటించకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు


సర్పంచ్ ఇంటి వద్ద విద్యార్థులు

ధారూరు: ఆర్టీసీ బస్సు సర్వీసులు సమయపాలన పాటించకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. విసుగు చెందిన విద్యార్థులకు సర్పంచ్‌ను ఆశ్రయించారు. మండల పరిధిలోని గడ్డమీది గంగారం గ్రామం నుంచి 30 మంది విద్యార్థులు పాఠశాలకు, కళాశాలకు వెళ్తుంటారు. ప్రతీ రోజు 7.15గంటలకు రావాల్సిన బస్సు ఆలస్యంగా వస్తోంది. దీంతో విసుగు చెందిన విద్యార్థులు శుక్రవారం సర్పంచ్ అమర్‌నాథ్ ఇంటికి వెళ్లి సమస్యను వివరించారు. దీంతో సర్పంచ్ వికాబాద్ డీఎంకు ఫోన్‌లో సమాచారం ఇచ్చి బస్సు పంపించాలని కోరడంతో ఉదయం 9.30గంటలకు బస్సు రావడంతో విద్యార్థులకు కళాశాలకు వెళ్లారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమిపూజ


భూమిపూజలో గిరిజన నేతలు

బషీరాబాద్: మండల కేంద్రంలో సేవాలాల్ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠాపనకు శుక్రవారం గిరిజన నేతలు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రామునాయక్ మాట్లాడుతూ.. గిరిజనుల ఆరాధ్యదైవం విగ్రహ ఏర్పాటు సంతోషదాయకమన్నారు. ఫిబ్రవరి 15న ప్రారంభిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గిరిజన నేతలు ఠాకేర్ నాయక్, నరేశ్‌చౌహాన్, ధన్‌సింగ్, నరేశ్‌రాథోడ్, గోపాల్, చందర్‌నాయక్, హన్మంత్ తదితరులు పాల్గొన్నారు.

అనాథలను ఆదుకునేందుకే 'కేఎస్‌ఆర్'

ట్రస్ట్ ఆధ్వర్యంలో కుట్టుమిషన్ల పంపిణీ


కుట్టుమిషన్లను అందజేస్తున్న శరత్‌కుమార్‌రెడ్డి

పరిగి: అనాథ బాలల అభ్యున్నతికి ఎల్లప్పుడు కృషి చేస్తానని కేఎస్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ శరత్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన జన్మదినం సందర్భంగా పట్టణ కేంద్రంలోని బాలసదనంలో ట్రస్ట్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అనాథ బాలల అభ్యున్నతికి అండగా ఉంటామన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుపేదలకు సహాయ సహకారాలు అందించేందుకు ముందుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జ్యోతిలింగం, పాండు, రాకేశ్, చాపలగూడెం సర్పంచ్ లక్ష్మణ్, కుల్కచర్ల మాజీ సర్పంచ్ జానకిరాం, బాలసదనం సూపరింటెండెంట్

విద్యార్థుల అభ్యున్నతికి సహకారం

దోమ: విద్యార్థుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తానని కేఎస్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ శరత్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన జన్మదినం సందర్భంగా మండల పరిధిలోని లింగస్‌పల్లి పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్, షూ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు విద్య, వైద్యం, ఆర్థిక స్తోమతను అందించేందుకు ట్రస్ట్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. అనంతరం పాలేపల్లిలో గ్రామానికి చెందిన మామిళ్ల లక్ష్మి, శివనగరి నర్సమ్మ అనారోగ్యాలతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న ఆయన వారి నివాసాలకు వెళ్లి బాధితులను పరమర్శించి రూ.10వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. గొడుగోనిపల్లిలో పద్మమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. వారి కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు బల్లరాణి, అమృతమ్మ, ట్రస్ట్ సభ్యులు ఆంజనేయులు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్‌ఐ ఆస్పత్రిని ఏర్పాటు చేయండి

- బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీవర్ధన్‌రెడ్డి
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేత


కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న శ్రీవర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్ రూరల్: పారిశ్రామిక వాడగా అభివృద్ధి చెందుతున్న షాద్‌నగర్‌లో 100 పడకల ఈఎస్‌ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని శుక్రవారం బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీవర్ధన్‌రెడ్డి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలోని ఫరూఖ్‌నగర్, కొత్తూరు, నందిగామ, కొందుర్గు, ఎలికట్టతో పాటుగా బాలానగర్, జడ్చర్ల ప్రాంతాల్లో పరిశ్రమలను నెలకొల్పారని, కార్మికులు ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఈఎస్‌ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని కోరారు. పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులను చికిత్స నిమిత్తం అత్యవసర సమయాల్లో హైదరాబాద్‌కు తీసుకెళ్లాల్సి వస్తోందని పేర్కొన్నారు. కార్మికులు హైద్రాబాద్‌కు వెళ్లాలంటే అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. కార్మికుల కష్టాలను దృష్టిలో పెట్టుకొని ఈఎస్‌ఐ ఆసుపత్రిని నిర్మిస్తే అందరికి అందుబాటులో ఉంటుందని వివరించారు. కేంద్ర కార్మిక శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌తో మాట్లాడి షాద్‌నగర్‌లో ఈఎస్‌ఐ ఆసుపత్రి నిర్మాణానికి కృషి చేస్తానని మంత్రి కిషన్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.